# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 16-06-2016**

బిసిలు, ఇతర ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని ఆడపిల్లల పెండ్లిళ్లలకు కూడా కళ్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున దీనికి సంబంధించిన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. పేద కుటుంబాలకు పెండ్లికి ముందే డబ్బులు అందే విధంగా, ఆడపిల్ల తల్లి చేతికి చెక్కు వచ్చే విధంగా, పూర్తి పారదర్శకంగా పథకం అమలు కావాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో పేదింటి ఆడపిల్ల పెండ్లి కుటుంబంలో ఆనందం నింపాలని చెప్పారు. దీంతో అధికారులు మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు.

దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకం లక్ష కుటుంబాల్లో వెలుగు నింపి కొత్త రికార్డు సృష్టించింది. 2014 సెప్టెంబర్ 24 న రాష్ట్రంలో కళ్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ పథకం ప్రారంభం అయ్యింది. ఇప్పటి దాకా 44,351 మంది ఎస్సీ అమ్మాయిలకు, 25,793 మంది ఎస్టీ అమ్మాయిలకు, 33,913 మంది మైనారిటీ అమ్మాయిలకు... మొత్తం 1,04,057 మందికి ఈ పథకం ద్వారా రూ.51 వేల ఆర్థిక సహాయం అందింది. ఇందుకోసం ఇప్పటి దాకా రూ.530 కోట్లకు పైగా ఖర్చు చేశారు. పేదింటి ఆడపిల్ల పెండ్లి భారం ప్రభుత్వం పంచుకోవడంతో చాలా కుటుంబాల్లో ఆనందం వ్యక్తం అవుతుందన్న సమాచారం ప్రభుత్వానికి అందింది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి బిసిలు, ఇతర ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ఆడపిల్లలకు కూడా ఈ పథకం వర్తింపచేయాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది. ఈ పథకం కోసం 2016-17 బడ్జెట్లో మైనారిటీ సంక్షేమ శాఖకు రూ.150 కోట్లు, ఎస్సీ సంక్షేమ శాఖకు రూ.200 కోట్లు, ఎస్టీ సంక్షేమ శాఖకు రూ.88 కోట్లు, బిసి సంక్షేమ శాఖకు రూ.300 కోట్లు కేటాయించారు. మొత్తం బడ్జెట్లో రూ.738 కోట్లు ఖర్చు చేశారు. ఈ పథకం పేదింటి ఆడపిల్ల పెండ్లి కష్టాలను తీర్చడమే కాకుండా, బాల్య వివాహాలను నియంత్రించే సామాజిక మార్పును కూడా ఈ పథకం తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి

భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పేదింటి ఆడపిల్లలందరికీ పథకం వర్తింపచేయాలని, బడ్జెట్లో కేటాయించిన నిధులే కాకుండా అవసరమైతే ఎక్కువ నిధులు కేటాయించడానికి కూడా ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. పథకంలోని మహోన్నత, మానవత్వ కోణాన్ని అర్థం చేసుకుని అధికారులు పకడ్బందీగా ఈ పథకాన్ని అమలు చేయడానికి మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని సిఎం ప్రత్యేక కార్యదర్శి కె.భూపాల్ రెడ్డి తెలిపారు.

**సిపిఆర్ఓ టు సిఎం**